నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, సోమవారం 11 మార్చి 2024 | VIKARABAD




# ఉడుం పట్టు..

**సరిహద్దులో కుస్తీ పహిల్వాన్‌లు**

- అట్టహాసంగా జీవన్గిలో కుస్తీ పోటీలు
- విజేతగా నిలిచిన కర్ణాటక వాసి
- తరలివచ్చిన మూడు రాష్ట్రాల ప్రజలు
- విజేతను సన్మానించి డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

బషీరాబాద్, మార్చి 10 : యువకుల కేరింతల నడుమ కుస్తీ పోటీలు అట్టహాసంగా సాగాయి. మావోడు గెలుస్తాడంటే... లేదు లేదు మావోడే తప్పక గెలుస్తాడంటూ... కుస్తీ పోటీలు సాగాయి. మహాశివరాత్రి జాతరలో భాగంగా బషీరాబాద్ మండలం జీవన్గి మహాదేవలింగేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఆదివారం ఎంతో సరదాగా, ఉత్కంఠగా కొనసాగాయి. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పోటీదారులు వచ్చారు. మూడు రాష్ట్రాల నుంచి వచ్చిన యువకులు నేనంటే నేను అన్నట్లుగా పోటాపోటీ పడ్డారు. దాదాపు కొన్ని గంటల పాటు ఎంతో ఉత్కంఠగా జరిగిన పోటీల్లో చివరకు కర్ణాటకకు చెందిన యువకుడు విజేతగా నిలిచాడు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జీవన్గి గ్రామంలో వెలసిన మహాదేవలింగేశ్వరాలయంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. పోటీల్లో పాల్గొనేందుకు కర్ణాటక రాష్ట్రం బీదర్, సేడం, చించోళి, అడ్కి, కురుగుంట, గుల్బర్గా, సులేపేట్, ఇర్గుపల్లి, కర్షికాలం, కర్కిముకిలి, మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్, దేవ్‌ని తదితర ప్రాంతాలతో పాటు బషీరాబాద్ మండలం కొర్విచెడ్, ఇందర్‌చెడ్, బషీరాబాద్, క్యాద్గీరా, జీవన్గి, తదితర గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీలను తిలకించేందుకు వేల సంఖ్యలో జనం తరలివచ్చారు. టెంకాయతో ప్రారంభమైన కుస్తీ పోటీలు వెండి కడియంతో ముగిశాయి. చిన్నవారు చిన్న వారితో పెద్ద వారు పెద్ద వారితో విడివిడిగా కుస్తీపట్లు పడ్డారు. చివరి పోటీల్లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీకాంత్ కంబ్లె, మహేశ్ పోటీ పడగా, శ్రీకాంత్ విజేతగా నిలిచాడు. విజేతను కుస్తీ పడిన ప్రదేశం నుంచి ఆలయం వరకు భుజాలపై ఎత్తుకుని జై కొడుతూ తీసుకొచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెండి కడియంను బహుమతిగా ఇచ్చి ఘనంగా సన్మానించారు. పోలీసుల తరఫున తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు రూరల్ సీఐ అశోక్ విజేతను సన్మానించారు. ఉత్సవాలను ఆలయ కమిటీ నిర్వహించగా, ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



విజేతను సన్మానించిన డీఎస్పీ, సీఐ, ఆలయ కమిటీ సభ్యులు

**కలశం వేలం..**

మహాదేవలింగేశ్వర జాతర సందర్భంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న కలశం వేలం పాట ఆదివారం నిర్వహించారు. మేడ్చల్ పట్టణానికి చెందిన భీమ్‌రెడ్డి రూ. 85,101లకు కలశాన్ని దక్కించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ పూజరులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కలశాన్ని అప్పగించారు.

**ముగిసిన జాతర..**

అంగరంగ వైభవంగా జరిగిన జాతర ఆదివారంతో ముగిసింది. అశేష భక్తజనానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

- పోర్టల్‌లో నమోదైన లబ్ధిదారులు 11 వేలకుపైనే..
- రంగారెడ్డి జిల్లాలో సుమారు రూ.20 కోట్లకుపైగా ప్రోత్సాహకం పెండింగ్‌లోనే..
- ఆశించిన స్థాయిలో అందని కిట్లు
- బీఆర్‌ఎస్ హయాంలో మహిళల్లో మంచి ఆదరణ పొందిన 'కేసీఆర్ కిట్'
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ దవాఖానల్లో తగ్గనున్న కాన్పులు
- మాతా, శిశు మరణాలపైనా ప్రభావం



మాతాశిశుల ఆరోగ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. సర్కారు దవాఖానల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించి కాన్పుల సంఖ్యనూ పెంచింది. మగబిడ్డ పుడితే రూ.12వేలు, ఆడ బిడ్డ జన్మిస్తే రూ.13 వేలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నది. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు అమలు చేసిన కేసీఆర్ కిట్ పథకం.. మహిళల ఆదరాభిమానాన్ని చూరగొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అంతా గోల్‌మాల్ అయ్యింది. కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్‌గా మార్చి నిధుల కొరతంటూ సరఫరాను తగ్గించింది. సర్కారు దవాఖానల్లో కాన్పులు చేయించుకున్న వారికి ఎంసీహెచ్ కిట్లు అందక లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుతుండడం బాధాకరం.

# ఎదురుచూపులు!

## కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్ పథకంగా పేరు మార్పు.. నిధుల కొరతంటూ నిలిపివేసిన కిట్ల పంపిణీ



బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన కేసీఆర్ కిట్

రంగారెడ్డి, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : బాలింతలకు అండగా నిలిచే ఎంసీహెచ్ కిట్ల పథకానికి నిధుల కొరత వేధిస్తున్నది. గతంలో కేసీఆర్ కిట్ పేరుతో ఉన్న ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. గత ప్రభుత్వంలో ఈ పథకం మహిళల నుంచి అనూహ్య ఆదరణ పొందింది. అయితే కొంత కాలంగా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం నిలిచిపోవడంతో లబ్ధిదారులు పరేషాన్ అవుతున్నారు. అక్కడక్కడా కిట్ల కొరత సైతం ఉండడంతో ఆశించిన స్థాయిలో లబ్ధిదారులకు పంపిణీ కావడంలేదు. తాజాగా నెలకొన్న పరిస్థితులతో ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. ఈ ప్రభావం మాతా, శిశు మరణాలపైనా చూపనున్నది.

**62 శాతం కాన్పులు ప్రభుత్వ దవాఖానల్లోనే..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. ప్రసవం తర్వాత మగబిడ్డ పుడితే తల్లికి రూ.12వేలు, ఆడ బిడ్డ జన్మిస్తే అదనంగా వెయ్యి తో కలిపి రూ.13 వేలను రెండు దఫాలుగా గత ప్రభుత్వం అందజేసింది. వీటి తోపాటు తల్లీబిడ్డల కోసం డ్రెస్సులు, చీరలు, బేబీ నూనె, బేబీ పౌడర్, టవల్, షాంపూ వంటి 18 రకాల వస్తువులతో కూడిన కిట్‌ను అందజేసేవారు. ఈ కిట్‌కు మంచి డిమాండ్ ఉన్నది. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ నాటికి మొత్తం 26,702 డెలివరీలు కాగా.. అందులో 62 శాతం కాన్పులు ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగాయి. అయితే ప్రోత్సాహకంగా అందించాల్సిన నగదుకు కొన్నాళ్లుగా బ్రేక్ పడింది. అలాగే కిట్ల కొరతతో ఆశించిన మేర అందడం లేదని సమాచారం. దవాఖానల్లోని వైద్యులను అడిగితే కిట్లు రాలేదని అంటున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు.

**పెండింగ్‌లో రూ.20 కోట్లకు పైగా ప్రోత్సాహకం..**

గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు జరిగిన వారిలో సుమారు 11వేల మందికిపైగా ఎంసీహెచ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారికి ప్రోత్సాహకంగా సుమారు రూ.20కోట్లకు పైగా నగదు అందాల్సి ఉన్నది. లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసినా నగదు జమ కాకపోవడంతో ప్రోత్సాహక డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పేరు మార్పుపై చూపిన శ్రద్ధ కిట్ల పంపిణీ, నగదు అందజేతపై చూపడంలేదనే విమర్శలున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాన్పులు అయిన వెంటనే కేసీఆర్ కిట్లను అందించేవారు. కానీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రోత్సాహక నగదు కోసం సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదించినా ఎలాంటి స్పందన లేదు. దీంతో లబ్ధిదారులకు సమాధానం చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయని కొంతమంది వైద్యులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య తగ్గి మాతా,శిశు మరణాలపైనా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వారంటున్నారు.

**న్యూట్రిషన్ కిట్ల పంపిణీలోనూ..**

గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్ల పంపిణీలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. గర్భిణులను పోషకాహార లోపం, రక్తహీనత నుంచి కాపాడేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ కిట్‌లో రూ.2 వేల విలువజేసే కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూరం, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, అరకిలో నెయ్యి, 200గ్రాముల పల్లీపట్టి, ఒక కప్పు, ప్లాస్టిక్ బాటిల్ ఉంటాయి. అయితే ప్రస్తుతం కిట్ల కొరత ఏర్పడడంతో పంపిణీ నిలిచిపోయింది. గతేడాది డిసెంబర్ నాటికి జిల్లాలో 45,763 మంది గర్భిణులను గుర్తించి 11,059 మందికి న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా..? లేక రద్దు చేస్తుందా..? అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

# మార్చిలోనే మాడు పగిలేలా..



## భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి



ఇబ్రహీంపట్నం, మార్చి 10 : భానుడు భగభగ మండుతున్నాడు. గతనెల చివరి వారం నుంచే తన ప్రతాపాన్ని చూపిస్తున్నా.. కొన్ని రోజులుగా మరింతగా సెగలు కక్కుతూ జనాలకు చెమటలు పట్టిస్తున్నాడు. మార్చి నెల ఆరంభంలోనే ఇలా ఉంటే ముమ్ముందు మరెంత తీవ్రంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వడగాల్పులు, ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్య ప్రతాపం మొదలవుతున్నది. దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. సాధారణంగా ఈ సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 34 డిగ్రీల లోపు ఉండాలి. కానీ ప్రస్తుతం అంతకుమించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వారం కిందట 30 డిగ్రీలున్న గరిష్ఠ ఉష్ణోగ్రత.. ఆదివారం ఏకంగా 38.8 డిగ్రీలు నమోదైంది. ప్రజలు ఎండ తాపాన్ని తట్టుకోలేక శీతలపానీయాల కోసం పరుగులు పెడుతున్నారు.

**ముందు జాగ్రత్తలు తప్పనిసరి..**

వేసవిలో ప్రధానంగా వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల సమయంలో ఎండలో తిరుగవద్దని సూచిస్తున్నారు. తప్పనిసరి అయినప్పుడు టోపీలు, రుమాలు నెత్తిన ధరించాలని చెబుతున్నారు. కండ్లకు నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్ వాడాలని, బైక్‌లపై తిరిగే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. సహజ సిద్ధమైన కొబ్బరినీరు, లస్సీ, మజ్జిగ, అంబలి, తాజా పండ్లరసాలు తీసుకోవాలని, తరుచుగా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగుతూ ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.



# పైసల్లేక..పనులు సాగుతలె

## నిలిచిన రహదారుల విస్తరణ

దాదాపు 150 ప్రాంతాల్లో తీవ్రప్రభావం | రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలం

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రాఫిక్ చిక్కులను అధిగమించేందుకు చేపడుతున్న రహదారుల విస్తరణ పనులపై నిధుల ప్రభావం తీవ్రంగా పడింది. ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్న బల్దియా.. అభివృద్ధి పనులకు నిధులను కేటాయించలేకపోతున్నది. దీంతో గడిచిన కొద్ది రోజులుగా వివిధ పథకాల కింద జరుగుతున్న రహదారి విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని చోట్ల పూర్తిగా నిలిచిపోగా..మరికొన్ని ప్రాంతాల్లో నత్తనడకన నడుస్తున్నాయి. ఎస్ఆర్‌డీపీ, సాధారణ రోడ్లు, మిస్సింగ్ రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి పనులకు జరగాల్సిన రహదారి విస్తరణ పనులతో దాదాపు 150 ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడుతున్నది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, కోఠి, గచ్చిబౌలి, ఎల్బీనగర్, రామంతాపూర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో మరోవైపు వీఐపీల తాకిడి, మరోవైపు నిలిచిన రహదారి పనులతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలవుతున్నది. వాస్తవంగా జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం వెయ్యి కోట్ల మేర భూ సేకరణ పనులు జరగాల్సి ఉన్నది. నిధులు లేకపోవడంతో ఈ ప్రక్రియ పూర్తిగా అటకెక్కింది. దీని కారణంగా ఎస్ఆర్‌డీపీలో భాగంగా శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లై ఓవర్ పనులకు భూసేకరణ అంతరాయం ఏర్పడింది. నిర్దేశిత గడువులోగా ఈ ఫ్లై ఓవర్ పూర్తి కావడం అనుమానంగా ఉన్నది. మాడల్ కారిడార్ అభివృద్ధి పనులు కొన్ని చోట్ల జరుగుతుండగా, నాగోల్‌లో పనులు నిలిచిపోయాయి. ఆదర్శ్ సొసైటీ, అమెరికన్ కాన్సులేట్ వద్ద లింకు రోడ్డు పనులు తుది దశలో ఉన్నప్పటికీ పూర్తి చేయలేకపోతున్నారు. బోరబండ సున్నం చెరువు వద్ద లింకు రోడ్డు పూర్తి కాకపోయినప్పటికీ అధికారులు రికార్డులో పూర్తి అయినట్లు చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చిలకలగూడ, సంగీత్ చౌరస్తా, పంజాగుట్ట, నాగార్జున సర్కిల్, సోమాజిగూడ రాజీవ్ సర్కిల్‌లో జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. ఈ రహదారుల విస్తరణ పనుల్లో జరుగుతున్న ఆలస్యంతో ట్రాఫిక్ సమస్యలు అధిగమవుతున్నాయి. కమిషనర్, ప్రభుత్వం జోక్యం చేసుకోని రహదారుల విస్తరణ పనుల్లో వేగం పెంచాలని వాహనదారులు కోరుతున్నారు.



**రహదారి విస్తరణ పనుల వివరాలు**

| జోన్ | ఎస్ఆర్‌డీపీ | సాధారణ రోడ్లు | మిస్సింగ్ లింక్ రోడ్లు | జంక్షన్ల అభివృద్ధి | సీపీపీ |
|---|---|---|---|---|---|
| ఎల్బీ నగర్ | 8 | 6 | 3 | 0 | 0 |
| చార్మినార్ | 6 | 21 | 5 | 0 | 4 |
| ఖైరతాబాద్ | 1 | 15 | 5 | 4 | 0 |
| శేరిలింగంపల్లి | 3 | 13 | 14 | 5 | 0 |
| కూకట్‌పల్లి | 0 | 14 | 4 | 1 | 0 |
| సికింద్రాబాద్ | 5 | 6 | 2 | 5 | 0 |




'కొత్తకొత్తగా ఉన్నది..కోటి తారలే..పూల ఏరులై'.. అన్న చరణాలు గుర్తుకు తెచ్చేలా.. ఆదివారం ఆహ్లాద సాగర తీరం..విరబూసిన పూల సోయగాలతో సందర్శకులకు మధురానుభూతిని పంచింది. ఈ అందమైన దృశ్యమాలికను 'నమస్తే' కెమెరా క్లిక్‌మనిపించింది.

# హలీం..ఆరగిద్దాం..



**వెలిసిన హలీం సెంటర్లు**

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : రంజాన్ మాసం రాగానే ముస్లింల ఉపవాస దీక్షలతో పాటు వెంటనే గుర్తొచ్చేది హలీం. దీంతో నగరంలో హలీం సందడి షురూ అయ్యింది. ప్రతి గల్లీలోనూ హలీం సెంటర్లు వెలుస్తున్నాయి. ముస్లింలకు ఇఫ్తార్ విందులో ప్రముఖ వంటకమైన ఈ హలీం.. మతాలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇష్టమైన స్నాక్‌గా మారింది. ఈ వంటకాన్నీ అరేబియన్స్ పరిచయం చేశారు. దీనిని హరీస్ అని కూడా పిలుస్తారు. పదో శతాబ్దంలో కితాబ్ అల్ తబిక్ (వంటల పుస్తకం)లో తొలిసారిగా ఈ విషయాని రాశారు. హైదరాబాద్ నిజాం ఆర్మీ దగ్గర ఉండే అరేబియన్ సైన్యం హలీంను మన దేశంలోకి తీసుకొచ్చింది. హలీంను చికెన్, మటన్‌తో తయారు చేస్తారు. సుమారు 6 నుంచి 8 గంటల వరకు హలీం తయారీకి సమయం పడుతుంది. ప్రతి వంద గ్రాముల హలీంలో 157 క్యాలరీలు, 9.7 గ్రాముల ప్రొటీన్, 6.86గ్రాముల కొవ్వు పదార్థం, 15.2 గ్రాముల పిండిపదార్థాలుంటాయని తెలిపారు. హలీం రుచి కోసం ఇతర రాష్ట్రాల వారు సైతం హైదరాబాద్‌కు తరలొస్తుండటం విశేషం.